# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 20 వ భాగం

### హిరణ్యకశిపుడు, ప్రహ్లాద చరిత్ర – 2

ఇప్పటివరకూ హిరణ్యకశిపుడు చదువులేక ప్రహ్లాదుడు ఇలా ఉన్నాడు కామోసు అనుకుని పిల్లాణ్ణి చండామార్కుల దగ్గిరకి పంపించేడు కదా? అక్కడకెళ్ళాక ఏం జేసాడు గురుకులంలో?

ఉ. అంచితభక్తితోడ దనుజాధిపు గేహసమీపముం బ్రవే
శించి సురారిరాజసుతుఁ జేకొని శుక్రకుమారకుల్ పఠిం
పించిరి పాఠయోగ్యములు పెక్కులు శాస్త్రము లా కుమారుఁ డా
లించి పఠించె నన్నియుఁ జలింపని వైష్ణవభక్తిపూర్ణుఁడై. [7-134]

శాస్త్రాలన్ని చదివింపచేసారు. పైకి ఏం చదువుతున్నా ప్రహ్లాదుడు మాత్రం ఇవన్నీ ఎలా చదివివాడంటే, "జలింపని వైష్ణవభక్తిపూర్ణుఁడై". తండ్రి పంపించాడని చదువుతున్నాడంతే, కానీ మనసులో ఉండేది శ్రీహరే. అదే గురుమంత్రం గొప్పదనం. సర్వకాల సర్వావ్యవస్థల్లోను అది శిష్యుణ్ణి జాగృతం చేస్తూ ఉంటుంది. ప్రహ్లాదుడు సామాన్యమైన శిష్యుడా? ఇది చాలదన్నట్టూ అతడి గురువు సాక్షాత్తూ నారదుడు.

క. ఏ పగిది వారు చెప్పిన
నా పగిదిం జదువుఁగాని య ట్టి ట్టని యా
క్షేపింపఁడు తా నన్నియు
రూపించిన మిథ్య లని నిరూఢమనీషన్. [7-135]

ఎలా చదవమంటే ఏది చదవమంటే అది వాళ్ళు చెప్పినట్టుగా చదివాడు. వాళ్లు చెప్పేవన్నీ తనకి పనికివావు అని తెల్సినా సరే. ఇలా ఎందుకంటే, మళ్ళీ మనం "విద్యా వినయసంపన్నే.." అనేది గుర్తు తెచ్చుకోవాలి. భగవంతుణ్ణి తెలుసుకోవాలంటే అన్నింటికన్నా ముందు ఉండవల్సింది – అణుకువ. "నేను" అనేది పుర్తిగా పోవాలి. ఆ అహంకారం అంతరించింది కనకనే ప్రహ్లాదుడు వాళ్ళేం చెప్పినా మారు మాట్లాడకుండా చదివాడు.

ఉ. మోదముతోడ దైత్యకులముఖ్యుడు రమ్మని చీరఁ బంచె బ్ర
హ్లాదకుమారకున్ భవమహార్ణవతారకుఁ గామ రోష లో
భాది విరోధివర్గ పరిహారకుఁ గేశవచింతనామృతా
స్వాద కఠోరకుం గలుషజాల మహోగ్రవనీకుఠారకున్. [7-137]

కొంతకాలం గడిచింది. కుర్రాడు ఈ పాటికి బాగు పడ్డాడేమో చూద్దాంఅని ప్రహ్లాదుణ్ణి తీసుకురమ్మని పిలిపించేడు రాక్షస రాజు. ఈ సరికి ప్రహ్లాదుడెలా తయరయ్యేడో పోతన మనకి చెప్తున్నాడు. భవమహార్ణవతారకు – సంసార సాగరాన్ని తరించినవాడూ, కామ రోష లోభాది శత్రుసమూహమును గెల్చినవాడూ; కేశవ చింతనామృతం తాగుటచే గట్టిపడినవాడు అయ్యేడుట. మళ్ళీ ఇందులో పాపాల నేలకి గునపంలా తయారయ్యేడుట. రాబోయే రోజుల్లో అతడే తండ్రి గుండెల్లో గునపంలాగా తయారవబోతున్నాడనేది చెప్పకనే చెప్తున్నాడు ఇక్కడ.

శా. ఉత్సాహప్రభుమంత్రశక్తియుతమే యుద్యోగ? మారూఢ సం
విత్సంపన్నుఁడ వైతివే? చదివితే వేదంబులున్ శాస్త్రముల్?
"వత్సా ర" మ్మని చేరఁ జీరి కొడుకున్ వాత్సల్యసంపూర్ణుఁ డై
యుత్సంగాగ్రముఁ జేర్చి దానవవిభుం డుత్కంఠ దీపింపగన్. [7-139]

ఇంతకాలం బయట ఉన్న కొడుకు ఇంటికిరాగానే సంతోషం అయింది రాజుగారికి. ప్రహ్లాదుడు రాగానే వళ్ళో కూర్చోబెట్టుకుని " ఒరే అబ్బాయ్, ఏంటి కథ, చదువు అదీ బాగుందా, నీకు అన్నింటికన్నా ఏది నచ్చింది గురుకులంలో?" అని అడుగుతున్నాడు. కుర్రాడు ఈ పాటికి మారిపోయి ఉంటాడని ఆశ.

ఉ. ఎల్ల శరీరధారులకు నిల్లను చీఁకటినూతిలోపలం
ద్రెళ్ళక "మీరు నే" మను మతిభ్రమణంబున భిన్ను లై ప్రవ
ర్తిల్లక "సర్వము న్నతని దివ్యకళామయ" మంచు విష్ణునం
దుల్లముఁ జేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ! [7-142]

శరీరం ఉన్నవాళ్లందరూ నేనూ, మీరూ అనే వైషమ్యతో ఉంటూ చీకటి నూతిలో పడిపోతూ ఉంటారు. వీళ్లకంటే మనస్సు శ్రీహరి మీద పెట్టి అడవిలో బతికే వాళ్లే మేలు తండ్రీ అని చెప్తున్నాడు ప్రహ్లాదుడు. శ్రీహరి ఆశ ఏమిటంటే ఈ పాటికి నిశాచరాగ్రణి గారిలో రాక్షసత్వం పోయిందేమో అని. భగవంతుడు మనకి ఎన్ని అవకాశాలైనా ఇస్తాడు కదా మారడానికి? ఇక్కడ హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి చూసి బాగా నిరాశ చెందుతూంటే అక్కడ శ్రీహరి ఇంకా నిరాశగా వీడికేసి చూస్తున్నాడన్నమాట, "అయ్యో, అయ్యో" అనుకుంటూ. ఏమిటేమిటీ? వీడికి చదువు, నీతి శాస్త్రం నేర్పమని చెప్తే ఇదా వీడు వల్లించేది? కానీ ప్రహ్లాదుడు చిన్నపిల్లాడు కదా అని హిరణ్యకశిపుడు నవ్వుకుని ఇలా అన్నాడు.

క. ఎట్టాడిన నట్టాడుదు
రి ట్టి ట్టని పలుక నెఱుఁగ రితరుల శిశువుల్
దట్టించి యెవ్వ రేమని
పట్టించిరొ బాలకునకుఁ బరపక్షంబుల్ [7-144]

చిన్నపిల్లలకేం తెలుస్తుంది? ఎవరు ఏమనమంటే అదే అంటారు. ఎలా ఆడమంటే అలా ఆడతారు. ఎవరో వీడికి ప్రతిపక్షం – అంటే శ్రీహరి – గురించి ఇలా అనమని పురి ఎక్కించారు కాబోలు. ఇలా అనుకుని పిల్లాడితో అంటున్నాడు మళ్ళీ.

శా. నాకుం జూడఁగఁ జోద్య మయ్యెడిఁ గదా నా తండ్రి! యీ బుద్ధి దా
నీకున్ లోపలఁ దోఁచెనో? పరులు దుర్నీతుల్ పఠింపించిరో?
యేకాంతంబున భార్గవుల్ పలికిరో? యీ దానవశ్రేణికిన్
వైకుంఠుఁడు గృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీ కేటికిన్? [7-145]

నాకు ఆశ్చర్యంగా ఉందిరా అబ్బాయ్. నీకి ఇవన్నీ ఎవరు చెప్పారు? నీకు మనసులో తోచిందా లేకపోతే మన చండామార్కుల వారు ఎప్పుడో ఒకసారి ఏకాంతంగా ఉన్నప్పుడు నీతో అన్నారా? విష్ణువు మన రాక్షస జాతికి బద్ధ వైరి. వాడి గురించి వర్ణించడం అవీ మనకి కాదు. మనం చేసే పనులు వేరే ఉన్నాయి. అవి ఏమిటంటే

మ. సురలం దోలుటయో, సురాధిపతులన్ స్రుక్కించుటో, సిద్ధులం
బరివేధించుటయో, మునిప్రవరులన్ బాధించుటో, యక్ష కి
న్నర గంధర్వ విహంగ నాగపతులన్ నాశంబు నొందించుటో,
హరి యంచున్ గిరియంచు నేల చెడ మోహాంధుండవై పుత్రకా! [7-146]

దేవతల్ని ఓడించాలి. వాళ్ల రాజుల్ని భయపెట్టాలి. సిద్ధులు ఎవరైనా ఉంటే వాళ్లందర్నీ పీడించాలి. ఇవి చాలకపోతే యక్ష కిన్నర గంధర్వ విహంగ నాగపతుల్నందర్నీ నాశనం చేయవచ్చు. అంతే కానీ హరీ, గిరీ అనీ వాడి సంగతి మనకెందుకు?

శా. అజ్ఞుల్ కొందఱు నేము దా మనుచు మాయం జెంది సర్వాత్మకుం
బ్రజ్ఞాలభ్యు దురన్వయక్రమణునిన్ భాషింపఁగా నేర రా
జిజ్ఞాసాపథమందు మూఢులు గదా చింతింప బ్రహ్మాది వే
దజ్ఞుల్ తత్పరమాత్ము విష్ణు నితరుల్ దర్శింపఁగా నేర్తురే? [7-148]

ఇక్కడ రాజుగారికి ఇంత పట్టుదలగా ఉంటే అటువైపు ప్రహ్లాదుడి ఇంకా ఎక్కువ పట్టుదలగా ఉంది. ఇప్పుడు దీటుగా సమాధానం చెప్తున్నాడు. జ్ఞానం లేనివాళ్ళు మేము మీరు అనుకుంటూ మాయలోపడి ప్రజ్ఞాలభ్యుని (ప్రజ్ఞాలభ్యుడు – బుద్ధిబలముచేత అందని వాడు, విష్ణువు), దురన్వయక్రమణుని (దురన్వయక్రమణుడు – అన్వయ (ఘటింప) రాని (శక్యముగాని) క్రమణుడు (ప్రవర్తనగలవాడు), విష్ణువు) గురించి మాట్లాడ్డం కూడా చేయలేరు. బ్రహ్మ, వేదం తెల్సిన వేదవిదులకీ కూడా నారాయణుడు అందేవాడు కాదు.

ఇక్కడ్నుంచీ హిరణ్యకశిపుడు శ్రీహరి చేతిలో చచ్చిపోయేదాకా తండ్రీ కొడుకులు నువ్వా నేనా అనేటువంటి ఒకదానికొక వ్యతిరేక మనసులతో వాదించుకోవడం పోతన తెలుగు భాషలో విశ్వరూపం చూపించి రాశాడు హృద్యంగా. మనసు ఒకసారి దేవదేవుడి మీదకు మళ్ళిందంటే ఆ తర్వాత ఎలా ఉంటుంది?

సీ. మందార మకరంద మాధుర్యమునఁ దేలు
మధుపంబు బోవునే మదనములకు?
నిర్మల మందాకినీవీచికలఁ దూఁగు
రాయంచ జనునె తరంగిణులకు?
లలిత రసాలపల్లవ ఖాదియై చొక్కు
కోయిల చేరునే కుటజములకుఁ?
బూర్ణేందుచంద్రికా స్ఫురితచకోరక
మరుగునే సాంద్రనీహారములకు? [7-150]

తే. నంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ జేరనేర్చు?
వినుతగుణశీల! మాటలు వేయునేల? [7-150.1]

మంచి తేనె తాగే తుమ్మెద ఉమ్మెత్త పూవు దగ్గిరకి వెళ్లగలదా? నిర్మలమైన గంగానదిలో ఈదే రాజహంస మామూలు ఏరుల్లో ఎలా ఈదగలదు? మామిడి చిగుర్లు తినే కోకిల కొండమల్లెల దగ్గిరకి వస్తుందా? ఇన్ని మాటలు దేనికీ? శ్రీహరి పాదాలమీద ఒకసారి లగ్నమైన మనసు ఇంకదేనిమీదకీ మరలదు.

ఈ సీస పద్యం భాగవతంలో అన్ని సీస పద్యాలకన్నా లోకవిదితమైంది అనడం అతిశయోక్తి కాదు. ఇంకో విధంగా చూడాలంటే ఈ పద్యం మనకి ఉండాల్సిన అంకితభావం గురించి చెప్పకనే చెప్తోంది. ఒకసారి ఏ పనిమీదైనా దృష్టి పెడితే ఎంతలా అందులో లీనమవుతే అంత మంచిది కదా? ఇక్కడ ప్రహ్లాదుడు తన సొంత మనఃస్థితి ఇలాగే వర్ణిస్తున్నాడు.

ఇక్కడకొచ్చేసరికి హిరణ్యకశిపుడి సంగతి అలా ఉంచి అక్కడే ఉండి చూస్తూన్న చండామార్కులవారికి కంపరం మొదలైంది. అవదు మరీ? శ్రీహరి గురించి వీళ్ళే ఇలా పురి ఎక్కించారేమో – నేనంటే పడక – అని అక్కడ రాజుగారు అనుకుంటున్నాడు. వీళ్ళేమో నీతిశాస్త్రాలు నేర్పితే నేర్చుకుని ఇప్పుడిక్కడ శ్రీహరి గురించి మాట్లాడుతున్నాడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు చెప్పినదంతా విని హిరణ్యకశిపుడు నోరు విప్పేలోపుల ఈ గురువులే చెప్తున్నారు:

ఉ. పంచశరద్వయస్కుఁడవు బాలుఁ డవించుక గాని లేవు భా
షించెదు తర్కవాక్యములు, చెప్పిన శాస్త్రములోని యర్థ మొ
క్కించుక యైనఁ జెప్ప వసురేంద్రుని ముందట, మాకు నొఁదలల్
వంచుకొనంగఁ జేసితివి వైరివిభూషణ! వంశదూషణా! [7-152]

నీకేమో ఐదేళ్ళు. వేలెడంత లేవు. అక్కడ గురుకులంలో మేము చెప్పినవన్నీ మాట్లాడకుండా అప్పచెప్తున్నావ్. కానీ ఇక్కడకొచ్చేసరికి అవన్నీ చెప్పవు. మా తల దించుకునేలా చేసి అవమానం పాలు చేస్తున్నావు మమ్మల్ని. నువ్వో వైరి విభూషణుడివీ, వంశదూషణుడివి. అని మళ్ళీ రాజుగారితో చెప్తున్నారు:

క. ఈ పాపనిఁ జదివింతుము
నీ పాదము లాన యింక నిపుణతతోడం
గోపింతుము దండింతుము
కోపింపకు మయ్య దనుజకుంజర! వింటే. [7-154]

ఈ కుర్రాణ్ణి ఈ సారి కొట్టో, తిట్టో సరిగ్గా చదివిస్తాం. కోపించకుండా ఇంకో అవకాశం ఇవ్వండి అంటున్నారు. సరే తీసుకెళ్ళండి, ఈ సారి విష్ణువు నామం నోట్లోంచి రాకూడదు అని వాళ్ళని పంపించేడు రాజుగారు.

ఇక్కడోసారి ఆగి గుర్తుంచుకోవాల్సిన విషయం ఆలోచిద్దాం. ఎవరు ఎవరికి మారడానికి ఇంకో అవకాశం ఇస్తున్నారు? హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడికా లేకపోతే శ్రీహరి హిరణ్యకశిపుడికా? భగవద్గీతలో "ప్రహ్లాదశ్చాస్మి దైత్యానం" (10.30) అన్నాడు కదా కృష్ణుడు? సాక్షాత్తూ శ్రీహరి స్వరూపుణ్ని వళ్ళో కూర్చోబెట్టుకుని ఒరే నువ్వు నాలాగా మారాలి అంటున్నాడు తండ్రి. హిరణ్యకశిపుడు ఎంత అదృష్టవంతుడు కాకపోతే ఇలాంటి కొడుకుని కని వళ్ళోకూర్చోబెట్టుకోగలడు? అందుకే పోతన వీడు పుట్టినప్పుడు అద్భుతచరితున్ అన్నాడు.

హిరణ్యకశిపుడు ఋణావేశ ఆలోచనలు అనుకుంటే ప్రహ్లాదుడు ధనావేశ ఆలోచనలు అన్నమాట. ఎప్పటికైనా సరే ప్రపంచంలో జరిగేది ఏమిటంటే – Positive overcomes negative (Sri Sivananda Saraswati ). కానీ దీనికి సమయం పడుతుంది. అదే కర్మ పరిపాకం కావడం అంటే. వచ్చే వ్యాసంలో తండ్రీ కొడుకుల మాటల యుద్ధం, అవన్నీ దేనికి దారితీస్తాయో చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS